ఏపీ.. కర్ణాటక కుమ్మక్కు!

- తెలంగాణ నోటికాడి కృష్ణా జలాలకూ ఎసరుపెట్టే యత్నం
- శ్రీశైలానికి తుంగభద్ర నీళ్లు రాకుండా ఎగువనే మాయం
- నావలి విస్తరణలో కన్నడిగులు
- వరదజలాల పేరిట ఏపీ కుట్రలు
- హెచ్ఎల్‌సీకి సమాంతరంగా మరో కాలువ తవ్వకం
- పరస్పర ఒప్పందంతో అమలుకు అడుగులు
- చూసీచూడనట్టుగా రేవంత్ సర్కారు వ్యవహారం
- తెలంగాణకు తీవ్ర నష్టమంటున్న నీటి రంగ నిపుణులు

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ కూడబలుక్కుంటున్నాయి. తుంగభద్ర జలాలను చెరబట్టేందుకు ఉమ్మడిగా అడుగులు వేస్తున్నాయి. నావలి విస్తరణ పేరిట కర్ణాటక, వరదమాటున కాలువ తవ్వకానికి ఆంధ్రప్రదేశ్ సర్కారు సిద్ధమవుతున్నాయి. పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగుతున్నాయి. దీంతో తుంగభద్ర జలాలు ఎగువనే మాయం కానున్నాయి. శ్రీశైలానికి జలాలు రాక తెలంగాణ ఎండిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. ఇంత జరుగుతున్నా తెలంగాణ సర్కారు మాత్రం చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నది.

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదికి వచ్చే జలాల్లో తుంగభద్ర కూడా అత్యంత కీలకం. నికర జలాల లభ్యత ఉన్న బేసిన్ ఇదే. తుంగభద్ర నుంచే కృష్ణా నదికి దాదాపు 500 టీఎంసీలకుపైగా జలాలు వస్తుంటాయి. శ్రీశైలం ప్రాజెక్టు ప్రధాన నీటి వనరు కూడా ఇదే. కృష్ణా జలాలపై ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో తుంగభద్రపై ఎక్కడ పడితే అక్కడ ప్రాజెక్టులను చేపట్టకుండా ట్రిబ్యునల్ అనేక ఆంక్షలు విధించింది. దీనిని బట్టి తుంగభద్ర ప్రాధాన్యం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ ఒకవైపు కర్ణాటక, మరోవైపు ఏపీ ప్రభుత్వాలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. ట్రిబ్యునల్ అవార్డును తుంగలో తొక్కుతూ ప్రాజెక్టులను చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. పరస్పరం సహకరించుకుంటూ తుంగభద్ర జలాలను ఎగువనే మాయం చేసే పన్నాగాలకు తెరలేపాయి. క్విడ్‌ప్రో విధానంలో అక్రమంగా ప్రాజెక్టులను చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ఇరు రాష్ట్రాల చర్యతో శ్రీశైలం డ్యామ్‌కు ప్రవాహాలు రాకుండా పోతాయని, వెరసి తెలంగాణకు తీరని నష్టంవాటిల్లే ప్రమాదం ఉన్నదని నీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉలుకూపలుకు లేకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలొస్తున్నాయి.

తుంగభద్రకు బ్యాలన్సింగ్ రిజర్వాయర్!

తుంగభద్ర డ్యామ్‌లో పూడికపెరిగి పూర్తిస్థాయి నీటిని వినియోగించుకోలేని పరిస్థితులున్నాయనే సాకుతో ప్రస్తుతమున్న లోలెవల్ కెనాల్ (ఎల్ఎల్‌సీ)కి సమాంతరంగా మరో కాలువను తవ్వేందుకు కర్ణాటక సర్కారు సిద్ధమైంది. అదేవిధంగా 31 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న నావలి రిజర్వాయర్‌ను 52 టీఎంసీలకు విస్తరించేందుకు ప్రణాళికలను సిద్ధంచేసింది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 230 టీఎంసీల నీటిని వినియోగించుకునే లక్ష్యంతో తుంగభద్ర డ్యామ్‌ను నిర్మించారు. తుంగభద్ర డ్యామ్ కింద కర్ణాటకలో 9,30,626 ఎకరాలు, ఏపీలో 6,25,097 ఎకరాలు, తెలంగాణలో 87వేల ఎకరాలు ఆయకట్టు ఉన్నది. డ్యామ్‌లో పూడిక పెరగడం, వరద ప్రవాహాల్లో వచ్చిన మార్పులు, అవిరి నష్టాలతో కలుపుకుని ప్రస్తుతం 174.72 టీఎంసీలను కూడా వినియోగించుకోలేని పరిస్థితి ఉన్నదని సాకులు చెప్తూ తాజాగా ఈ ప్రతిపాదనలను సిద్ధంచేసింది. మొత్తంగా 55.28 టీఎంసీలను నష్టపోవాల్సి వస్తున్నదని, ఈ నేపథ్యంలోనే కొప్పల్ జిల్లా గంగావతి తాలుకాలో ఇప్పటికే 31 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన నావలి రిజర్వాయర్‌ను 52 టీఎంసీలకు విస్తరించి తుంగభద్ర డ్యామ్‌కు బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ఎల్ఎల్‌సీకి సమాంతరంగా మరో కాలువను తవ్వి తుంగభద్ర వరదను నావలికి తరలించేందుకు ప్రణాళికలు రూపొందించింది.

వరదజలాల పేరిట ఏపీ సర్కారు

తుంగభద్ర డ్యామ్ హైలెవల్ కెనాల్ మొత్తం పొడవు 189 కిలోమీటర్లు. ఇందులో 105 కిమీ వరకు కర్ణాటకలో, అక్కడినుంచి 189వ కిమీ వరకు ఏపీలోని అనంతపురం జిల్లా గుండా పోతుంది. ఈ కాలువ నుంచి ఆ జిల్లాలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్, పెన్నార్ అహోబిలం రిజర్వాయర్లు కూడా ఉన్నాయి. హెచ్ఎల్‌సీ ద్వారా ఏపీకి 32 టీఎంసీల జలాల కేటాయింపులు ఉన్నాయి. అంతేకాకుండా అవార్డులకు విరుద్ధంగా కేసీ కెనాల్‌కు సైతం అదనంగా దీని నుంచే జలాలను మళ్లిస్తున్నారు. ఇదిలా ఉంటే, కేవలం కృష్ణాకు వరదలు వచ్చిన క్రమంలో వాటిని తక్కువ సమయంలోనే తరలించి అనంతపురం జిల్లాలకు అందిస్తామని చెప్తున్న ఏపీ సర్కారు.. హెచ్ఎల్‌సీ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువను తవ్వేందుకు ప్రణాళికలు రూపొందించింది. చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రణాళికలను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నది. కృష్ణా ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్) అవార్డు ప్రకారం కడప-కర్నూలు (కేసీ) కెనాల్‌కు సుంకేసుల బరాజ్ నుంచి మాత్రమే తుంగభద్ర నదీ జలాలను వాడుకోవాలి. కానీ, అందుకువిరుద్ధంగా ఏపీ వ్యవహరిస్తున్నది. తుంగభద్ర నీటికి బదులుగా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి అనుమతుల్లేని మల్యాల, ముచ్చుమర్రి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి లిఫ్ట్ స్కీం పంపింగ్ స్టేషన్-1, ముచ్చుమర్రి వద్ద కేసీ కెనాల్ లిఫ్ట్ స్కీం ద్వారా, పోతిరెడ్డిపాడు దిగువన బనకచెర్ల వద్ద ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా మొత్తం నాలుగు అదనపు మార్గాల ద్వారా కృష్ణా జలాలను కేసీ కెనాల్‌కు మళ్లిస్తున్నది. అంతేకాదు తుంగభద్ర డ్యాం కుడివైపు హై లెవెల్ కెనాల్ ద్వారా కూడా మళ్లిస్తున్నది. అందుకు కర్ణాటక కూడా అంగీకారం తెలుపుతున్నది. దీనిని బట్టే ఇరు రాష్ట్రాలు కూడా తుంగభద్ర జలాలను ఎగువనే మాయం చేసేందుకు పరస్పరం సహరించుకుంటూ ముందుకు సాగుతున్నాయని తెలిసిపోతున్నది.

కాంగ్రెస్ సర్కారు మౌనం

కర్ణాటక ప్రతిపాదనలను ఆదిలోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించింది. నావలి రిజర్వాయర్ ప్రతిపాదనలకు అంగీకారం తెలపాలని 2022లో కర్ణాటక ప్రతిపాదించగా, ఇది తెలంగాణ ప్రయోజనాలకు తీరని నష్టమని, ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని బీఆర్ఎస్ సర్కార్ స్పష్టంచేసింది. ట్రిబ్యునల్-2 అవార్డు అమలులోకి వచ్చేంతవరకూ ఆ ప్రాజెక్టుపై ముందుకుపోవద్దని తుంగభద్ర బోర్డు మీటింగ్‌లోనూ తేల్చిచెప్పింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మాత్రం నోరు మెదపని దుస్థితి నెలకొన్నది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు ప్రాజెక్టుల విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నా, బోర్డులోనూ చర్చకు పెడుతున్నా కిక్కురుమనడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ ప్రణాళికల అమలును ఆ రెండు రాష్ట్రాలు మరింత ముమ్మరం చేయడం గమనార్హం.

తెలంగాణకు తీరని నష్టం

కర్ణాటక, ఏపీ రాష్ట్రాల ప్రతిపాదనలు అమలైతే తెలంగాణకు తీరని నష్టం వాటిల్లుతుంది. కృష్ణా నదికి తుంగ, భద్రలు ఉపనదులు. ఆ రెండింటి నుంచే ఏటా దాదాపు 500 టీఎంసీల మేరకు జలాలు కృష్ణా నదిలోకి వస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే బచావత్ ట్రిబ్యునల్ తుంగభద్ర నదిపై ఎక్కడ పడితే అక్కడ, ఎలా పడితే అలా ప్రాజెక్టులను నిర్మించకుండా అనేక ఆంక్షలు విధించింది. షరతులు పెట్టింది. కానీ, కర్ణాటక సర్కారు ఇప్పటికే ఆ నిబంధనలను తుంగలోకి తొక్కుతూ నిర్మాణాలు చేపడుతున్నది. ఇప్పుడు ఏకంగా నావలి, కొత్తగా మరికొన్ని బరాజ్‌ల నిర్మాణానికి పూనుకున్నది. ఇక ఏపీ సైతం వరదజలాల పేరిటనే ప్రాజెక్టులను చేపడతామని చెప్తూ తరువాత అనేక కుట్రలకు తెరలేపింది. ఆ రెండు రాష్ట్రాలు చేస్తున్న ప్రణాళికలు అమలైతే భవిష్యత్‌లో తుంగభద్ర నుంచి కృష్ణాలోకి వచ్చే జలాలు పూర్తిగా తగ్గిపోతాయి. ఫలితంగా కృష్ణా జలాలపైనే పూర్తిగా ఆధారపడిన తెలంగాణకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని తెలంగాణ ఇంజినీర్లు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు జలాలు రావడమే గగనమైపోతుందని వివరిస్తున్నారు. మొత్తంగా శ్రీశైలం ప్రాజెక్టు ఎల్లకాలం ఎండుడేనని హెచ్చరిస్తున్నారు.

అదే విషయాన్ని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ వేదికగా పలువురు నేతలు ప్రస్తావించడంతోపాటు కర్ణాటకను అడ్డుకునేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ రేవంత్ సర్కారు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తున్నది.

సుందిళ్ల బరాజ్ సీపేజీ సమస్యను పరిష్కరించాం

- నివేదికలపైనా అధికారులు సంతృప్తి వ్యక్తంచేశారు
- ప్రభుత్వం ఇంకా ఫైనల్ బిల్లులు చెల్లించడం లేదు
- కాళేశ్వరం కమిషన్ ఎదుట నవయుగ ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): సుందిళ్ల బరాజ్ వద్ద సీపేజీ సమస్యను పరిష్కరించామని, గ్రౌంటింగ్ పూర్తి చేశామని నవయుగ నిర్మాణ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచించిన మేరకు సాంకేతిక పరీక్షలను నిర్వహించామని తెలిపారు. ఈ మేరకు కాళేశ్వరం కమిషన్ ఎదుట గురువారం నివేదించారు. సుందిళ్ల బరాజ్‌ను నిర్మించిన నవయుగ సంస్థ డైరెక్టర్ రమేశ్, ప్రాజెక్ట్ ఇన్‌చార్జులు ఈశ్వరరావు, మాధవ్‌ను కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. బరాజ్ నిర్మాణం, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్, సాంకేతిక సమస్యలు, చేపట్టిన నివారణ చర్యలపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ బరాజ్ నిర్మాణం పూర్తయ్యాక ఓఅండ్ఎం కోసం ప్రత్యేకంగా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సుందిళ్ల బరాజ్ పనులు 2021 డిసెంబర్‌లో పూర్తయ్యాయని, 2023లో క్లియరెన్స్ వచ్చిందని చెప్పారు. 2022లో వచ్చిన భారీ వరదలతో బరాజ్‌కు చెందిన ఓ బ్లాకులోని సీసీ బ్లాకుల కింద సీపేజీ ఏర్పడిందని, అందువల్ల అన్ని సీసీ బ్లాకులపై ఎఫెక్ట్ పడిందని, గ్రౌంటింగ్ చేసి ఆ సీపేజీలను నియంత్రించామని వెల్లడించారు. ప్రభుత్వం, అధికారులు సిఫార్సు చేసిన పరీక్షలు, మరమ్మతులు పూర్తి చేశామని, వాటి నివేదికలు కూడా ఇచ్చామని, వాటిపై సంబంధిత అధికారులు సంతృప్తి వ్యక్తంచేశారని వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించి ఫైనల్ బిల్లులను ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని, బిల్లులను క్లియర్ చేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని కమిషన్ ఎదుట వాపోయారు.

ప్రాజెక్టుల కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

ఓఅండ్ఎం కమిటీ సమావేశంలో ఈఎన్సీ అనిల్‌కుమార్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): మేజర్, మీడియంతోపాటు అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన కాల్వల మరమ్మతులపై అధికారులు దృష్టిసారించాలని, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందేలా చూడాలని ఈఎన్సీ అనిల్‌కుమార్ ఆదేశించారు. గురువారం జలసౌధలో ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ కమిటీ సమావేశం ఈఎన్సీ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా 105 ప్రాజెక్టులకు సంబంధించి మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించి దాదాపు 70 పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఈఎన్సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టుల కాల్వలు అధ్వానస్థితిలో ఉన్నాయని దీంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. 10వేల ఆయకట్టుకు పైగా ఉన్న కాల్వల మరమ్మతులకు ప్రాధాన్యమివ్వాలని, అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

సెక్షన్-3 టీవోఆర్‌ను రద్దు చేయాలి

సుప్రీంలో ఏపీ సర్కారు వాదనలు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ట్రిబ్యునల్‌కు కేంద్రం జారీచేసిన సెక్షన్-3 టీవోఆర్‌ను రద్దు చేయాలని ఏపీ సర్కారు సుప్రీంకోర్టుకు విజ్ఞప్తిచేసింది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారమే విచారణ చేపట్టాలని కోరింది. తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాలను పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని తొలుత నిర్ణయించారు. ఈ మేరకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తొలుత మార్గదర్శకాలను జారీచేసింది. అయితే దానివల్ల తెలంగాణకు ఒరిగేది ఏమీ లేదని పేర్కొంటూ.. అంతర్రాష్ట్ర నదీజలాల చట్టం 1956లోని సెక్షన్-3 ప్రకారం కృష్ణాజలాల పునఃపంపిణీ చేపట్టాలని రాష్ట్రం డిమాండ్ చేస్తూ వచ్చింది. సుదీర్ఘ ప్రయత్నాల నేపథ్యంలో ఎట్టకేలకు కేంద్రంసైతం దిగివచ్చి ఆ మేరకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు నిరుడు అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలను జారీచేసింది. సెక్షన్-3 ప్రకారం ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీ చేపట్టాలని నిర్దేశించింది. అయితే దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏపీ ఇప్పటికే అటు ట్రిబ్యునల్‌లో, ఇటు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. సెక్షన్-3 ప్రకారమే కృష్ణాజలాల పంపిణీ చేపడతామని ఇటీవలనే ట్రిబ్యునల్ తేల్చిచెప్పింది. తాజాగా ఏపీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో గురువారం విచారణకు వచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. ఈ సందర్భంగా ఏపీ తన వాదనలను వినిపిస్తూ.. సెక్షన్-3 రెఫరెన్స్‌లను రద్దు చేయాలని కోరింది. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ మధ్య నీటి పంపకాలను ట్రిబ్యునల్ పూర్తి చేసిందని, అవార్డును ప్రకటించకముందే కొత్తగా రెఫరెన్స్‌లను జారీ చేయడం సరికాదని తెలిపింది. తదుపరి విచారణను ఫిబ్రవరి13వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

పింఛన్ సొమ్ము.. పన్నుకు చెల్లు!

మొదటిపేజీ తరువాయి...

లబోదిబోమంటున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూర్ గ్రామ పంచాయతీ అధికారులు వింతైన నిబంధనల పేరిట ఆసరా లబ్ధిదారులను, ఇతర గ్రామస్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 'ఇంటిపన్ను బకాయిలు చెల్లిస్తేనే రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు తీసుకుంటాం. ఇంటి పన్ను పెండింగ్ ఉందా? ముందు క్లియర్ చేసి రండి. నీ కొడుకు ఇంటి పన్ను కట్టలేదు. అందుకే నీకు రావాల్సిన పింఛన్ ఇంటిపన్ను కింద జమ చేసుకున్నాం. ఇదిగో రసీదు తీసుకొని పో' అంటూ ఆసరా పింఛన్ లబ్ధిదారుల చేతిలో పెడుతూ ఉత్త చేతులతో పంపుతున్నారు. పథకాలకు పన్నులకు ముడిపెట్టడం ఏమిటని.. పన్ను చెల్లించకపోతే తమకు రావాల్సిన పింఛన్ సొమ్మును జమ చేసుకునే అధికారం అధికారులకు ఎక్కడిది? అని వృద్ధులు ప్రశ్నిస్తున్నారు.

గ్రామంలో ఆరా తీసిన డీఆర్‌డీవో

నంనూర్ గ్రామ పంచాయతీ పింఛన్ విషయంపై జిల్లా అధికారులు స్పందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఆర్‌డీవో కిషన్ గురువారం నంనూర్ గ్రామానికి వచ్చి ఆరా తీశారు. ఇంటిపన్ను కట్టనందుకు పింఛన్ జమ చేసుకున్నట్టు తెలుసుకొని స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్ను కట్టలేదని పింఛన్ సొమ్ము జమ చేసుకోవడం నిబంధనలకు విరుద్ధమని అనంతరం మీడియాతో డీఆర్‌డీవో చెప్పారు. కొందరు పన్ను కింద పింఛన్ జమ చేసుకోవాలని స్వచ్ఛందంగా చెప్పారని తెలిపారు. గ్రామంలో తొమ్మిది మందికి ఇలా పింఛన్ ఆపినట్టు తెలిసిందని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని డీఆర్‌డీవో కిషన్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ తీరు దుర్మార్గం

- పన్నుల కింద పింఛన్లు గుంజుకుంటరా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఇంటి పన్ను బకాయిలున్నాయని చెప్పి వాటి కింద వృద్ధాప్య పింఛన్లు గుంజుకుంటరా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ లాక్కుంటరా? ఇట్ల ఎక్కడైనా ఉన్నదా? అని మండిపడ్డారు. ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతూ అమానుషంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని నిప్పులు చెరిగారు. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల? అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం ఏమిటి అని నిలదీశారు. ఓవైపు లబ్ధిదారుల్లో కోత విధిస్తూ, మరోవైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయికి జమ చేయడం శోచనీయమని, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐదొందలడిగినా ఇయ్యలే

ఇంటి పన్ను రూ.6 వేలు కట్టాలె. నా భర్త, ఇద్దరు కొడుకులు చనిపోయిన్రు. కూలిపనులు చేసుకొని బతుకుతున్న. ఇంటిపన్ను కోసం నా పింఛన్ డబ్బులు ఆపిన్రు. పండుగ ఉన్నది.. నా బిడ్డ వచ్చింది.. కనీసం ఐదొందలైనా ఇవ్వండి అని కారోబార్‌ను అడిగినా ఇయ్యలేదు. ఎంత బతిమిలాడినా పట్టించుకోలే.

- దొంకె చుక్కమ్మ, నంనూర్

రెండు నెలల నుంచి తీసుకున్నరు

నా ఇంటి పన్ను రూ.6 వేలు ఉంది. పింఛన్ తీసుకోగానే రూ.వెయ్యి ఇంటి పన్ను కింద జమ చేసుకున్నరు. నా దగ్గర రెండు నెలలుగా రూ.వెయ్యి చొప్పున తీసుకున్నరు. రసీదు ఇయ్యమంటే మొత్తం ముట్టినంకనే ఇస్తమని కారోబార్ చెప్పిండు. ఇంత అన్యాలమా? ఇది పద్ధతి కాదు.

- చౌటకారి చంద్రయ్య, నంనూర్

పింఛన్ మంజూరుకు 10 వేలు డిమాండ్

- ఏసీబీని ఆశ్రయించిన రిటైర్డ్ టీచర్
- లంచం తీసుకుంటూ పట్టుబడిన రామగుండం ఎస్టీవో, సబార్డినేట్

జ్యోతినగర్,(రామగుండం), జనవరి 23 : ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి పింఛన్ సాంక్షన్ చేయాలని వెళ్లిన రిటైర్డు ఉపాధ్యాయుడి వద్ద రూ.10వేలు లంచం తీసుకుంటూ పెద్దపల్లి జిల్లా రామగుండం సబ్ ట్రెజరీ అధికారి, సబార్డినేట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండంలోని రిటైర్డ్ ఉపాధ్యాయుడు కన్నూరి ఆనంద్ రావు తనకు పింఛన్ మంజూరు చేయాలని స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లాడు. ఎస్టీవో ఏకుల మహేశ్వర్ రూ.10 వేలు లంచం ఇస్తేనే పని అవుతుందని చెప్పడంతో సదరు రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ వీవీ రమణ మూర్తి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణకుమార్, పున్నం చందర్, అధికారులు ఇచ్చిన రూ.10 వేలను తీసుకెళ్లి సదరు రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎస్టీవో , ఆఫీస్ సబ్ ఆర్డినేట్ రెడ్డవేన పవన్‌కు ఇచ్చాడు. అదే సమయానికి ఏసీబీ అధికారులు కార్యాలయంలో దాడులు చేయగా ఎస్టీవో రూ.9 వేలు, అటెండర్ పవన్ రూ.వెయ్యి తీసుకుంటూ పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరు పరుచనున్నారు.

రామగుండంలో ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్ ట్రెజరీ అధికారి ఏకుల మహేశ్వర్, సబార్డినేట్ రెడ్డవేన పవన్

ఆమ్దానీ ఆగమాగం!

పడిపోయిన రెవెన్యూ రాబడులు • 2023-24తో పోల్చితే రూ.12,695 కోట్లు క్షీణత • రిజిస్ట్రేషన్ల ఆదాయంలోనూ తగ్గుదల

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఏడాది పాలనలో రాష్ట్రాన్ని అద్భుతంగా పాలించామని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటున్నది. ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో ఉత్సవాలు నిర్వహించింది. కానీ, వాస్తవాలు వేరుగా ఉన్నాయి. ఏడాది పాలనలో రాష్ట్ర ఖజానాకు వచ్చే ఆదాయం క్షీణించినట్టు ఆర్థిక శాఖ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలలకు సంబంధించిన ఆదాయ, వ్యయాల వివరాలను ప్రభుత్వం తాజాగా కాగ్‌కు అందించింది. 2023-24తో పోల్చితే గత తొమ్మిది నెలల్లో 10% ఆదాయం పడిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతున్నది. కాగ్‌కు ఇచ్చిన నివేదిక ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ప్రభుత్వానికి రెవెన్యూ రాబడులు రూ.1,12,307.30 కోట్లు వచ్చాయి. ఇదే సమయంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నాటికి రూ.1,25,002 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.12,694.42 కోట్ల క్షీణత నమోదైంది. అంటే దాదాపు 10%. కరోనా కాలాన్ని మినహాయిస్తే రాష్ట్ర చరిత్రలో ఈ స్థాయిలో క్షీణత నమోదవడం ఇదే తొలిసారి.

'రియల్' బేజారు

రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొన్నదని గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు, హైడ్రా, మూసీ వెంబడి కూల్చివేతలు, అవినీతి ఆరోపణలు వంటి కారణాలతో రియల్‌ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొన్నది. కొత్త ప్రాజెక్టుల ప్రకటన ఆగిపోగా.. పాతవి పూర్తికావడం లేదు. పూర్తయినా అమ్ముడుపోక రియల్టర్లు లబోదిబోమంటున్నారు. కాగ్‌లో పేర్కొన్న గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. 2023-24లో మొదటి తొమ్మిది నెలల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.10,654 కోట్ల ఆదాయం సమకూరింది. కానీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.10,571 కోట్లు వచ్చినట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఆదాయం పెరగాల్సిందిపోయి రూ.83 కోట్ల మేర తగ్గుదల నమోదైంది. రిజిస్ట్రేషన్ల ఆదాయంలో రూ.3,046 కోట్లను స్థానిక సంస్థలకు వాటాగా పంచినట్టు ప్రభుత్వం చెప్తున్నది. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయ లక్ష్యంలో తొమ్మిది నెలల్లో 41.28% సాధించినట్టు కాగ్‌కు వెల్లడించింది. ఇది గత ఏడాది (2023-24) 57.59 శాతంగా నమోదైంది. ఈ ఏడాది రెవెన్యూ రాబడుల లక్ష్యం రూ.2.21 లక్షల కోట్లు కాగా, తొమ్మిది నెలల్లో 50.76% మాత్రమే వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 57.72 శాతంగా ఉండేది. ఈ ఏడాది జీఎస్టీ రాబడుల లక్ష్యంలో 64% మాత్రమే చేరుకోగా, గత ఏడాది 67 శాతంగా నమోదైంది. దీనినిబట్టే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎటువైపు వెళ్తున్నదో అర్థం చేసుకోవచ్చని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

డిసెంబర్ నాటికి రెవెన్యూ రాబడులు ఇలా..

2023-24లో ఆదాయం 1,25,002.72 కోట్లు	తగ్గుదల 12,694.42 కోట్లు
2024-25లో వచ్చిన ఆదాయం 1,12,307.30 కోట్లు	తగ్గుదల శాతం 10.15%

అంబేద్కర్ వర్సిటీ వీసీ నియామకంపై వివరణ ఇవ్వండి

ప్రభుత్వానికి, చక్రపాణికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ నియామకంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. వర్సిటీ వీసీగా డాక్టర్ ఘంటా చక్రపాణి నియామకంపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యామండలి, యూజీసీతోపాటు వీసీ చక్రపాణిలను ఆదేశించింది. వీసీగా చక్రపాణికి అర్హతలు లేవని, జీవో 229 ను రద్దు చేయాలని కోరుతూ హనుమకొండకు చెందిన అసోసియేట్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బీ కుమారస్వామి వేసిన కోవారెంటో పిటిషన్‌ను గురువారం జస్టిస్ కే లక్ష్మణ్ విచారించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా చక్రపాణి నియామకం జరిగిందని చెప్పారు. ఆయనకు వయో పరిమితి కూడా దాటిపోయిందని తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఫిబ్రవరి 11లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

ఒక ఘటనపై ఇన్ని ఎఫ్ఐఆర్‌లా?

- లగచర్ల ఘటనలో మూడు కేసులపై హైకోర్టు ఆక్షేపణ
- అన్ని ఎఫ్ఐఆర్‌లలోని వాంగ్మూలాలు నివేదించండి : హైకోర్టు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మాసిటీ ఏర్పాటు నిమిత్తం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లినప్పుడు భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళన చేపడితే పోలీసులు ఏకంగా మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఒకసారి తమకు అందిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ అని, మరోసారి రైతుల వాంగ్మూలం మేరకు ఎఫ్ఐఆర్ అని, ఇంకోసారి ఇతర నిందితుల వాంగ్మూలం మేరకు ఎఫ్ఐఆర్ అని చెప్పి వేర్వేరుగా మూడు ఎఫ్ఐఆర్‌లను నమో దు చేయడాన్ని ప్రాథమికంగా తప్పుపట్టింది. ఒక ఘటనకు చెందిన కేసులో నిందితులుగా ఉన్న వారిని మరో ఎఫ్ఐఆర్ పేరుతో మళ్లీ నిందితులుగా చేరుస్తున్నారని వ్యాఖ్యానించిం ది. ఇప్పటివరకు అసలు ఎంతమంది నుంచి వాంగ్మూలాలు సేకరించారో, వాళ్లు ఏం చె ప్పారో పూర్తి వివరాలు నివేదించాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 20కి వాయిదా వేస్తూ జస్టిస్ కే లక్ష్మణ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గత న వంబర్ 11న లగచర్లలో భూసేకరణ నిమిత్తం అధికారులు ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి వెళ్లినప్పుడు రైతులు వాళ్లపై దాడి చేశారని ఆరోపిస్తూ పోలీసులు మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. తొలుత ఎఫ్ఐఆర్ 153, ఆ తర్వాత మరో రెండు ఎఫ్ఐఆర్‌లు (154, 155) నమోదు చేశారు. 153లో నిందితులుగా ఉన్న కొందరు రైతులను 154, 155లోనూ నిందితులుగా పేర్కొన్నారు. ఇది టీటీ ఆంటోనీ వర్సెస్ కేరళ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని, వేర్వేరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడం చెల్లదంటూ రైతులు పవార్ నాయక్ సహా ఐదుగురు హైకోర్టులో సవాలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు.. మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడాన్ని ఆక్షేపించింది.

శక్తి పానీయంగా ఓఆర్ఎస్ అమ్మకంపై పిల్

హైదరాబాద్, జనవరి 23, (నమస్తే తెలంగాణ): ఓఆర్ఎస్‌ను శక్తిపానీయాలంటూ తప్పుడు ప్రకటనలతో అమ్మకాలు జరగటంపై దాఖలైన పిల్‌లో హైకోర్టు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. ఓఆర్ఎస్ విక్రయాలపై పూర్తి వివరాలతో ఫిబ్రవరి 28లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసులో తమను ప్రతివాదిగా చేర్చాలం టూ ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా దాఖ లు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను ధర్మాసనం అ నుమతించింది. ఓఆర్ఎస్ విక్రయాల్లో కేం ద్ర ఆహారభద్రత, ఆహార ప్రమాణాల మండ లి జారీచేసిన అమలు కావడం లేదంటూ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎం శివరంజని 2022లో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రాధారాణితో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ప్రతివాదులైన ఎఫ్ఎస్ఎస్ఏఐ, సీడీఎస్సీవో, డ్రగ్స్ కంట్రోలర్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ, డీజీపీలతోపాటు జాన్సన్ అండ్ జాన్సన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, అమృతాంజన్ హెల్త్‌కేర్, స్టేపిట్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు నోటీసులు జారీచేసింది.

రోడ్ల గుంతలపై యాప్ రూపొందించండి

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రోడ్లపై గుంతల వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు, వాటిపై స్పందించి మరమ్మతు చర్యలు తీసుకోవడానికి వీలుగా యాప్‌ను రూపొందించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పంచాయతీరాజ్ శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు నాలుగు వారాల గడువు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆర్అండ్‌బీ రూపొందించిన 'టీ రాస్తా'లాంటి యాప్‌ను రూపొందించాలని సూచించింది. విచారణను ఫిబ్రవరి 20వ తేదీకి వాయిదా వేసింది.